# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గిరిజన గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ ఇరాన్ కు ప్రయాణాలను విరమించుకోవాలని భారత పౌరులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ సూచించింది.
- ❖ "మిషన్ అమృత్"లో భాగంగా దేశంలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ మణిపూర్‌లో కుకీ, మెయితీ జాతుల మధ్య ఘర్షణలకు ముగింపు పలికేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ వెల్లడించారు.
- ❖ హర్యాణాలో ఎన్నికల ప్రచారం రేపు సాయంత్రంతో ముగియనుంది.

==================================

ఝార్ఖండ్‌లో 'ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ఆవిష్కరించారు. 80 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ పథకం కింద 5 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందనున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... 'ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' కింద సుమారు 63 వేల గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, అలాగే 5 కోట్ల మందికి పైగా లబ్ధి పొందుతారని తెలిపారు.

(వాయిస్ 35 సెకన్లు)

==================================

ఇరాన్ కు అత్యవసరం కాని ప్రయాణాలను నివారించాలని భారత పౌరులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సూచించింది. ప్రస్తుతం ఇరాన్ లో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, టెహ్రాన్ లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరపాలని ట్రావెల్ అడ్వైజరీలో విదేశీ మంత్రిత్వ శాఖ కోరింది. ఈ ప్రాంతంలో ఇటీవల పెరిగిన భద్రతా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని ఎంఈఏ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీ రాజ్‌ఘాట్ లోని గాంధీజీ సమాధి వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు ఈ రోజు నివాళులర్పించారు. అలాగే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అంజలి ఘటించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అత్యంత ప్రముఖ పాత్ర పోషించిన మహా నేత గాంధీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొనియాడారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ద్వారా ఆయనకు నివాళి అర్పించారు. అదే విధంగా భారతదేశ రెండవ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాగా, మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పలువురు కేంద్రమంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆయనకు నివాళులు అర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హర్యానాలో ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకుంది. రేపు సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. హర్యానా శాసనసభలోని మొత్తం 90 మంది సభ్యులను ఎన్నుకోవడానికి ఈ నెల 5 పోలింగ్ జరగనుండగా, 8వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నేతలు బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ ఉక్లానా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన “జన ఆశీర్వాద్” ర్యాలీలో ఈ రోజు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ జులానా, భవానీఖేరా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మణిపూర్‌లో కుకీ, మెయితీ జాతుల మధ్య ఏడాదికిపైగా కొనసాగుతున్న హింసకు తెరపడేలా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రాజకీయ చర్చల్లో అన్ని సంఘాలు పాల్గొనాలని కోరారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్ లో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి రాజకీయ చర్చలు జరుపుతున్నామని తెలిపారు. కాగా, మణిపూర్‌లో గతేడాది మే 3వ తేదీన మెయితీలు, కుకీల మధ్య చెలరేగిన హింస ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. జాతుల ఘర్షణల కారణంగా ఎంతోమంది చనిపోయారు. దాంతో ఈ ఘర్షణలకు ముగింపు పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ప్రోత్సాహం పెరుగుతోంది. సెప్టెంబర్ నెలలోనే మొత్తం ఈవీ రిజిస్ట్రేషన్లు 1.59 లక్షల యూనిట్లకు చేరుకున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వాహనాల డేటా ప్రకారం చూస్తే ఈవీ రిజిస్ట్రేషన్లు గణనీయంగా 23 శాతం పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అన్ని విభాగాలలో మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు 7.45 లక్షల యూనిట్ల నుంచి 8.93 లక్షల యూనిట్లకు పెరిగాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“మిషన్ అమృత్”లో భాగంగా దేశంలోని వివిధ నగరాల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. “స్వచ్ఛ భారత్ మిషన్”కు 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఈ రోజు జరిగిన

“స్వచ్ఛతా హీ సేవ 2024” కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... 10 వేల కోట్ల రూపాయల విలువైన పారిశుద్ధ్య ప్రాజెక్టులను ఈ రోజు ప్రారంభించామని వివరించారు. నమామి గంగే, వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ను ఉత్పత్తి చేసే 'గోవర్ధన్' ప్లాంట్ కు సంబంధించిన కార్యక్రమాలు “స్వచ్ఛ భారత్ మిషన్” లక్ష్యాన్ని మరింత చేరువ చేశాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది వర్షాలు, వరదల కారణంగా ఒక వెయ్యి 492 మంది మృతి చెందారని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఐఎండి లెక్కల ప్రకారం వర్షాలు, వరదల వల్ల 895 మంది మృతి చెందగా, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాల కారణంగా 597 మంది మృతి చెందారు. ఈ ఏడాది 115.6 మిల్లీ మీటర్ల నుండి 204.5 మిల్లీమీటర్ల మధ్య భారీ వర్షపాతం నమోదైంది. గత సంవత్సరాల్లో ఇదే అత్యధిక వర్షపాతమని ఆ శాఖ తెలిపింది. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం సెప్టెంబర్ 30తో ముగిసింది. ఈ కాలంలో భారతదేశంలో 934.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఐఎండి పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (కేకేఎఫ్ఐ), అంతర్జాతీయ ఖోఖో ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 2025లో భారత్ లో తొలి ఖోఖో ప్రపంచ కప్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. 6 ఖండాలకు చెందిన 24 దేశాలు పాల్గొనే ఈ పోటీల్లో 16 పురుషులు, మహిళల జట్లు పాల్గొంటాయని కేకేఎఫ్ఐ నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ కప్ కు ముందు ఈ క్రీడను ప్రోత్సహించడానికి దేశంలోని 10 నగరాల్లోని 200 పాఠశాలలకు ఈ క్రీడను తీసుకెళ్లాలనుకుంటున్నామని పేర్కొంది. ఈ అతి పెద్ద టోర్నమెంట్ కు ముందు కనీసం 50 లక్షల మంది క్రీడాకారులను నమోదు చేయాలనే లక్ష్యంతో ఫెడరేషన్ పాఠశాల విద్యార్థుల కోసం సభ్యత్వ డ్రైవ్ ను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా ఖో ఖో ప్రపంచ కప్ ను నిర్వహించడం ద్వారా స్వదేశీ భారతీయ క్రీడను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేకేఎఫ్ఐ నిర్వాహకులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అందుకున్న బహుమతుల ఇ-వేలం తేదీని ఈ నెల 31 వరకు పొడిగించారు. వాస్తవానికి ఇ-వేలం గడువు ఈ రోజుతో ముగిసింది. కాగా, నమామి గంగే నిధికి విరాళంగా అందించడం కోసం ఇ-వేలంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలను కోరింది. ఈ ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులు https://pmmementos.gov.in వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహాలయ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాపూజ సమీపిస్తున్న కొద్దీ ఆశ, మంచితనం, సానుకూలత వెల్లివిరియాలని సామాజిక మాధ్యమం ద్వారా ఆకాంక్షించారు. దుర్గామాత ఎల్ల వేళలా అందరికీ ఆనందం, బలం మంచి ఆరోగ్యంతో దీవించాలని ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =